క్లుప్తంగా

అనాథ పిల్లలకు పుస్తకాల అందజేత



నోట్‌పుస్తకాలు, బహుమతులు అందించిన విద్యార్థులు

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థులు మానసు అనాథాశ్రమాన్ని సందర్శించి విద్యార్థులకు కావాల్సిన నోట్ పుస్తకాలు అందించారు. తర్వాత పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి మాట్లాడుతూ ఇటువంటి ప్రదేశాల్లో పిల్లల బాగోగులు, నడవడిక, మానసిక స్థితిని అర్థం చేసుకోవడం ద్వారా సమాజంలో ఎలా మెసులుకోవాలని విద్యార్థులకు అలవడుతుందన్నారు. అలాగే కైలాసగిరిలోని డాప్లర్ వాతావరణ రాడార్ కేంద్రాన్ని విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థులు సందర్శించారు. మెటీరియాలజిస్ట్ జి.శ్రీనివాసరావు రాడార్ పనిచేసే విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

డాక్టర్ రమేష్‌బాబుకు సత్కారం



వైద్య సిబ్బందితో డాక్టర్ రమేష్‌బాబు

పెదగంట్యాడ: పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పని చేసిన డాక్టర్ రమేష్‌బాబు సేవలు అద్భుతమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో పని చేసి బదిలీపై వెళ్లిన డాక్టర్ రమేష్‌బాబు అభినందన సభను పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా డాక్టర్ రమేష్‌బాబుతో పాటు బదిలీపై వెళ్లిన ఫార్మసిస్టు వెంకటవేణు, ఆరుగురు హెల్త్ సెక్రటరీలను సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పి.హేమలత, డాక్టర్ సంపత్ బాబు, నాయకులు పులి రమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

గాజువాక: గాజువాక జోన్ స్వయం సహాయ సంఘాల రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లకు మెప్మా ద్వారా సమకూర్చిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేశారు. జీవీఎంసీ గాజువాక జోన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 244 మందికి ఆయన ట్యాబ్‌లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సమాజ ప్రగతిలో ఆర్పీలు ముందుండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, జోనల్ కమిషనర్ శేషాద్రి, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, తిప్పల వంశీరెడ్డి, ఏపీడీలు గంగాధర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'కొలిమి రాజెయ్యాల్సిందే' పుస్తకావిష్కరణ

సీతంపేట: అసమానతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని వివక్షపై పోరాటంగా చూడాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పతివాడ నాస్తిక్ రచించిన 'కొలిమి రాజెయ్యాల్సిందే' అనే పుస్తకాన్ని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ సమాజంలో అసమానతలు పెరిగితేనే తిరుగుబాటు వస్తుందన్నారు. సమాజంలో జరుగుతున్న ఘర్షణ, నైరాశ్యం, వివక్షపై కవులు, రచయితలు లోతుగా విశ్లేషించి స్పందించాలని కోరారు. పతివాడ నాస్తిక్ రచించిన కవిత్వం శ్రీశ్రీని గుర్తుచేసిందన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ విమర్శనాత్మకమైన కవితలతో పుస్తకం అక్షరాల కొలిమిలా ఉందన్నారు. కవి రెడ్డి రామకృష్ణ పుస్తక సమీక్ష చేశారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సభలో స్రవంతి ప్రధాన కార్యదర్శి చీకటి దివాకర్, అరసం విశాఖ అధ్యక్షుడు అడపా రామకృష్ణ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం జరిపారు.

కర్రీ.. రెడీ





- ఇంటివంటకు బ్రేక్
- కొత్త కొత్త రుచులతో కర్రీపాయింట్లు
- క్యూ కడుతున్న అధిక శాతం ప్రజలు

పెదగంట్యాడ: పోటీ ప్రపంచంలో ప్రజలు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా.. జీవన శైలిలో మార్పులు వస్తున్నాయి. బతుకు పోరాటంలో భార్యాభర్తలిద్దరూ ఏదో ఒక పని చేయాల్సిన రోజులు వచ్చాయి.దీనికి తోడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. ముగ్గురు నుంచి నలుగురు ఉండే కుటుంబాలే కనిపిస్తున్నాయి. దీంతో ఇంట్లో పనులు చేసుకునేందుకు సమయం లేక వంట పనులకు కూడా బ్రేక్ ఇస్తున్నారు. కర్రీపాయింట్లకే మొగ్గు చూపుతున్నారు.మీరు కర్రీస్ తెచ్చేయండి. నేను రైస్ పెట్టేస్తా.. ఇప్పుడు ఎక్కువగా ఇదే నడుస్తోంది. ఇంట్లో అన్నం మాత్రమే వండుకుంటున్నారు.. బయటి నుంచి కూరలు, పప్పు, సాంబార్, పచ్చళ్లు తెచ్చుకొని లొట్టలేసుకొని తింటున్నారు. దీంతో కర్రీపాయింట్లు ఇప్పుడు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.హోటళ్ల కంటే కర్రీపాయింట్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. వీటి వ్యాపారాలు కూడా జోరుగా సాగుతున్నాయి.

50కి పైగా ..

పదేళ్ల కిందట మండలంలో మెస్‌లు మాత్రమే ఉండేవి. అందులోనే కూరలు, పప్పు, సాంబార్ అమ్మేవారు. ప్రస్తుతం మండలంలోని ప్రధాన ప్రాంతాల్లో సుమారు 50 వరకూ కర్రీపాయింట్లు వెలిశాయి.

పెరిగిన ధరలూ కారణమే..

నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వంట నూనెలు ధరలు ఆకాశాన్ని అంటడంతో వాటిని కొనుగోలు చేసి.. ఇంట్లో వండుకునే బదులు కేవలం రూ.20 నుంచి రూ.50 వరకూ కూరలను కర్రీపాయింట్లలో కొనుగోలు చేస్తున్నారు. చికెన్ ఫ్రై, కర్రీ అయితే రూ.70 నుంచి రూ.100 వరకూ అందుబాటులో ఉండడంతో నాన్‌వెజ్ ప్రియులు వాటివైపు మొగ్గు చూపుతున్నారు. రూ.60 నుంచి రూ.80 వరకూ వెచ్చిస్తే సాంబార్, పప్పు, కర్రీతో పాటు పెరుగు దొరుకుతుండడంతో ఐదుగురు తినేందుకు సరిపోతోంది.

విస్తరిస్తున్న కర్రీ పాయింట్ కల్చర్..

ఊరు నుంచి చుట్టాలు వచ్చారు..వచ్చినప్పుడు పక్క వీధిలో ఉన్న కర్రీ పాయింట్‌లో రెండు కర్రీస్, సాంబారు, ఓ పెరుగు ప్యాకెట్ తెచ్చేయండి సరిపోతాయ్..మరో చోట నేను బయట ఉన్నాను.. మీరు వచ్చేటప్పుడు లంచ్‌కి ఒక ఫ్రై కర్రీ, పప్పు తెచ్చేసుకోండి నేను నేనే రైస్ పెట్టేస్తా.. ఇప్పుడు ప్రతి ఇంట్లో వినిపించే మాటలు.



అందుబాటులో పచ్చళ్లు.. కారం పొడులు..

కర్రీపాయింట్లలో పప్పు, రసం, సాంబార్, రైస్‌తో పాటు వెజ్, నాన్ వెజ్ కూరలతో పాటు వివిధ రకాల పచ్చళ్లు (వెజ్, నాన్ వెజ్)తో పాటు కారం పొడులు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే పిండివంటలు కూడా విక్రయిస్తున్నారు. బూర్లు, పులిహోర, బొబ్బట్లు నిత్యం అందుబాటులో ఉంటున్నాయి.

రోజుకో స్పెషల్

కర్రీ పాయింట్ల నిర్వాహకులు రోజుకో రుచిని ప్రజలకు అందిస్తున్నారు. దీంతో వాటికి ఆదరణ పెరుగుతోంది. పెదగంట్యాడతో పాటు చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లోని కర్రీపాయింట్లలో వెజ్, నాన్‌వెజ్ కూరల్లో కొత్త రకాలను పరిచయం చేస్తూ కర్రీపాయింట్ల నిర్వాహకులు ఆహార ప్రియుల మన్ననలు అందుకుంటున్నారు.

జీవనోపాధికి దోహదం..

హోటళ్లలో పని చేసే అనుభవం ఉన్న వారే కాకుండా సొంతకాళ్లపై నిలబడాలనే ఉద్దేశంతో.. ఉన్న వారు తక్కువ పెట్టుబడితో కర్రీపాయింట్లు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. ఇంటిపెద్దతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఒకరికొకరు సాయపడుతూ ఈ వ్యాపారంలో రాణిస్తున్నారు. ఉదయం 4గంటల నుంచే కర్రీస్‌కు కావాల్సిన సామగ్రి, ఇతర వస్తువులను సమకూర్చుకుంటున్నారు. ఉదయం 11 గంటలకే అన్ని రకాల కూరలను సిద్ధం చేస్తున్నారు. సాయంత్రం మళ్లీ కుటుంబ సభ్యులతో కలసి వంటకాల పనుల్లో నిమగ్నమవుతున్నారు.

సెలవు దినాల్లో వ్యాపారాల జోరు

శని, ఆదివారాలు వచ్చాయంటే చాలు కుటుంబమంతా బయటే గడపడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వంటకు టాటా చెబుతున్నారు. బయట వంటకాలను రుచి చూడానికి ఇష్టపడుతున్నారు. దీంతో హోటళ్లు, కర్రీపాయింట్లలో వ్యాపారం జోరుగా సాగుతోంది.



పెదగంట్యాడలో కర్రీ పాయింట్ వద్ద కొనుగోలుదారులు

రుచి, శుచి ఉంటేనే ఆదరణ



15 సంవత్సరాలుగా కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాను. హోటళ్లు, కర్రీపాయింట్లలో విక్రయించే వంటకాలతో పాటు రుచి, శుచి, నాణ్యత ఉంటేనే కొనుగోలుదారులు ఇష్ట పడుతున్నారు. రుచి, శుచి, నాణ్యత ప్రమాణాలు పాటించే పాయింట్లకే ఆదరణ ఉంటోంది. నాణ్యత ఇవ్వగలిగితేనే వ్యాపారం జరుగుతోంది. కూరగాయాలు, నిత్యావసర వస్తువులు ధరలు హెచ్చుతగ్గులు ఉన్నా కొనుగోలుదారుల కోసం అన్ని రకాలు అందుబాటు ధరల్లో విక్రయిస్తాం..

– లంకా జగదీష్, అమ్మ వంటిళ్లు కర్రీ పాయింట్ నిర్వాహకుడు, పెదగంట్యాడ

సమయం ఆదా..



నిత్యవసరాలతో పాటు కూరగాయల ధరలు పెరిగిపోతుండడంతో చిన్న చిన్న పనులు చేసుకంటూ జీవనం సాగించే మాలాంటి వాళ్లం. కర్రీపాయింట్లలోనే పప్పు, రసం, సాంబార్, కూరలు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇంట్లో అన్నం వండుకుంటున్నాం. కూరలు మాత్రం బయటి నుంచి తెచ్చుకుంటున్నాం. దీంతో శ్రమతో పాటు సమయం ఆదా అవుతోంది. తక్కువ ఖర్చుతోనే నచ్చిన కూరలు తింటున్నాం.

– గొందేశి సుమన్‌రెడ్డి, కార్మికుడు, నెల్లిముక్కు

పెళ్లింట్లో చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం

గాజువాక: శీలానగర్ ఏరియాలోని వెంకటేశ్వర కాలనీలో ఒక పెళ్లింట్లో చోటుచేసుకున్న భారీ దొంగతనం కేసులో గాజువాక క్రైం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. చోరీ జరిగిన అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తునకు కొంతమేర ఇబ్బంది తలెత్తినప్పటికీ పోలీసులు తమకు అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఇతర అపార్ట్‌మెంట్లు, వాటిని అనుసంధానం చేసి ఉన్న రహదారుల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. నిందితులు చోరీకి పాల్పడిన ఇంట్లో ఉన్న బ్యాగులోనే సొత్తు మొత్తాన్ని నింపుకొని వెళ్లిపోయినట్టు గుర్తించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు ముగ్గురు దొంగలు ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. చోరీ చేసిన సొత్తుతో నంబరు ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై దువ్వాడ రైల్వే స్టేషన్‌వైపు వెళ్లినట్టు భావిస్తున్నారు. గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాస్, ఎస్ఐ మన్మథరావు ప్రత్యేక బృందాలుగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

విమల విద్యాలయం కోసం రేపటి నుంచి నిరసన దీక్షలు

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయాన్ని తెరవాలన్న డిమాండ్‌తో ఈనెల 16 నుంచి నిరసన దీక్షలు చేపట్టనున్నట్టు 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. పాఠశాల ప్రారంభించకుండా కూటమి ప్రభుత్వం తీవ్ర ఆటంకాలు సృష్టిస్తుందని మండిపడ్డారు. పాఠశాల గుర్తింపు కొనసాగింపు కోసం డీఈవోకు అనుమతి లెటర్ ఇవ్వకుండా కుట్రలు చేస్తుందని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నెల రోజులు దాటినా పాఠశాల ప్రారంభించకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 23న ఉక్కు యాజమాన్యం, డయాసిస్ సంస్థ, ఉపాధ్యాయుల మధ్య రాతపూర్వక ఒప్పందం జరిగిందన్నారు. అనుమతి ఇవ్వాలని సూచించాల్సిన విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేలు ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ ఇవ్వాలని లేఖలు ఇవ్వడం వారి నైజాన్ని బయటపెడుతుందన్నారు. పాఠశాల మూసివేయాలనే కుట్ర వల్ల 1600 మంది పేద కుటుంబాలు నడిరోడ్డున పడతాయన్నారు. పాఠశాల కోసం చేస్తున్న దీక్షల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొంటున్నారన్నారు.

పూడికలు తీయరా?



కాలువలో నిలిచిపోయిన మురుగు

- కాలువల్లో నిలిచిపోతున్న మురుగు
- దుర్వాసన వెదజల్లడంతో ప్రజల అవస్థలు



దుర్వాసన వెదజల్లుతున్న రాజీవ్‌నగర్‌లోని కాలువ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డులోని పలు ప్రాంతాల్లో కాలువలు, డ్రైనేజీల నిర్వహణను గాలికి వదిలేశారు. పాలకులు పట్టించుకోకపోవడం, అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మురుగు కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మురికి నీరు నిల్వ ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రధానంగా రాజీవ్‌నగర్ ఫేజ్ -1లో కాలువలు మురుగు నీటితో నిండిపోయాయి. దీంతో పందులు తిష్టవేసి ఆ ప్రాంతాన్ని బురదమయం చేస్తున్నాయి. దోమలు కూడా అధికమై ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

వుడానగర్‌లో..

వుడానగర్‌లో అయతే కాలువలు మరీ దారుణంగా తయారయ్యాయి. అక్కడి వారు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. కార్పొరేటర్‌తో పాటు అధికార పార్టీ నాయకులు అనేకమంది హడావుడి చేసినా తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అవసరమైన సమావేశాలు పెట్టినప్పుడు జనసమీకరణకు మాత్రమే కనపడుతుంటారని వాపోతున్నారని రాజీవ్‌నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వార్డులో అధికార పార్టీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోవడం వల్లే ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా లేకపోలేదు. ఒక నాయకుడు కార్పొరేటర్‌ను కాదని అంతా తానేనంటూ హడావుడి చేస్తున్నారు. అయితే ఆయన చేసేది ఏమీ లేకపోయినా కొంతమంది పెద్దలు మద్దతు ఆయనకే ఉండడం వల్ల స్థానిక కార్పొరేటర్ అయోమయంలో పడ్డారు. అందువల్ల వార్డులో ఏసమస్య పరిష్కారం కాలేదన్న వాదన కూడా వినిపిస్తుంది. ఏది ఏమైనప్పటికీ రాజీవ్‌నగర్‌లో మురుగు కాలువల సమస్య తక్షణమే పరిష్కరించి తమను దోమలు,పందులు బారి నుంచి రక్షించాలని అక్కడి వారు కోరుతున్నారు.

తాగునీరు వృథా పట్టదా



పెద్దిళ్లు సమీపంలో ఏర్పడిన లీకులు

- తాగునీటి పైప్‌లైన్ లీకులు
- మూడు నెలల నుంచి పట్టించుకోని అధికారులు



టింబర్ డిపో సమీపంలో వృథాగా పోతున్న తాగునీరు

పెదగంట్యాడ: జీవీఎంసీ నీటి సరఫరా అధికారుల నిర్లక్ష్యంతో పైపులైన్లకు ఏర్పడుతున్న లీకుల వల్ల వేల లీటర్లు తాగునీరు నిత్యం వృథాగా పోతుంది. నెలలు గడుస్తున్నా, ఫిర్యాదులు చేసినా లీకేజీలను అరికట్టడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి కొత్త దిబ్బపాలెం కదిరి పెద్దిళ్లు సమీపంలో,టింబర్ డిపో ప్రాంతాల్లో రెండు చోట్ల తాగునీటి పైపులకు లీకేజీలు ఏర్పడి సుమారు మూడు నెలలుగా వేల లీటర్ల తాగునీరు వృథాగా మురుగు కాలువల పాలవుతోంది. సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు అందించేందుకు కుళాయిలు విప్పే సమయంలో ఈ నీరు వృథా మరింత ఉంటుందని వాపోతున్నారు. దీంతో పరిసర ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పల్లా

అగనంపూడి: మహా విశాఖ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని, అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. 79వ వార్డు ప్రశాంతినగర్, అగనంపూడి, గొల్లవానిపాలెం, కేఎస్ఎన్‌రెడ్డినగర్‌లలో రూ.2.90 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజీల పనులకు సోమవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక నియోజవర్గంలోని విలీన గ్రామాల్లో అన్ని వసతులు కల్పించనున్నామనారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, బొండా జగన్, గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి, ఈఈ ఎంఆర్ఎస్ అప్పారావు, ఏఈ కేథరీనాథ్, వివిధ విభాగాల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పెంపు

పెదగంట్యాడ: ప్రభుత్వ ఐటీఐ గాజువాకలో ప్రవేశాల గడువును ఈ నెల 15 నుంచి 20 వరకూ పెంచామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గడువు కూడా ఈ నెల 22 వరకూ పెంచామన్నారు. ఐటీఐలో 400 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 23 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటి వరకూ 2వ కౌన్సెలింగ్ కోసం 1594 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. అందులో 1122 మంది మాత్రమే సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారని వివరించారు. మిగిలిన విద్యార్థులు కూడా తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రమణ

మురళీనగర్: రక్తదానం ద్వారా మరో ముగ్గురికి ప్రాణ దానం చేయవచ్చని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అన్నారు. గైస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, లయన్స్ క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్ వి.ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.వి.రమణ మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారికి మనం అందించే రక్తమే ప్రాణం నిలబెడుతుందన్నారు. ఇటువంటి మహత్తరమైన కార్యక్రమంలో విద్యార్థులు ముందుకొచ్చి తనతో పాటు రక్తదానం చేయడంపై ఆయన అభినందించారు. పలువురు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి ప్రశంసించారు. కళాశాల ద్వారా సేకరించిన 39 యూనిట్ల రక్తాన్ని లయన్స్ క్లబ్‌కు అందించారు.

కన్నేలమ్మా..వర్షాలు కురిపించమ్మా..



కన్నేలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: వర్షాలు కురవాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ మండలంలోని నెల్లిమక్కు పెంటమాంబ ఆలయ ఆవరణలో వేంచేసియున్న కన్నేలమ్మ అమ్మవారితో పాటు ఎదురునరుసులు విగ్రహాలకు భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. పూర్వ ఆచారాలను అనుసరించి ఆషాడ మాసంలో వర్షాలు కురవాలని, ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవార్లకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాకారులకు ఘన సత్కారం



పదవీ విరమణ చేసిన కళాకారులను సత్కరిస్తున్న కళాకారులు

ఉక్కునగరం: ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేసిన కళాకారులను ఘనంగా సత్కరించారు. స్థానిక సెక్టార్-1లోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం లో కళాకారులు కె. సింహాచలం, కె. సత్యనారాయణ, వై.టి. దాస్ దంపతులకు పూలమాలలు వేసి అభినందించారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత మరింత పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఉద్యోగాలు రావాలంటే ఈ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగాలన్నారు. ప్రజలు ప్రభుత్వానికి కట్టిన పన్నులతో తయారైన ఈ స్టీల్‌ప్లాంట్ ప్రజల ఆస్తి అని.. ప్రభుత్వ రంగంలో కొనసాగాలన్నారు. స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగితేనే అన్ని వర్గాలకు రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. ఆర్. కృష్ణార్జున అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కళాకారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.